క్లుప్తంగా

సంఘ భవనాలకు నిధులు మంజూరు



ప్రొసీడింగ్ కాపీలు అందిస్తున్న మంత్రి ఈశ్వర్

ధర్మారం: మండలంలోని ఖిలావనపర్తిలో వివిధ కులసంఘాల భవన నిర్మాణాలకు రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ నిధులు మంజూరు చేశారు. ఆదివారం కరీంనగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సహకార సంఘాల జిల్లా చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి సమక్షంలో సర్పంచు సాగంటి తార, ఎంపీటీసీ మోతె సుజాతలకు ప్రొసీడింగ్ కాపీలను మంత్రి అందించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు పాకాల రాజయ్య, మాజీ సర్పంచు మోతె అంజయ్య, నాయకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, సెర్ప్ ఉద్యోగులు

పెద్దపల్లిరూరల్: పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు పేస్కేల్ వర్తింపజేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి క్యాంపు కార్యాలయంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుర్రం రమేశ్, శ్రీనివాస్, బాపు, కనకతార, ఆనంద్, తదితరులున్నారు.

పల్లె ప్రకృతివనంలో వలంటీర్ల శ్రమదానం



శ్రమదానం చేస్తున్న వలంటీర్లు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లో గాయత్రీ డిగ్రీ, పీజీ కాలేజీకి చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఆరు రోజులుగా ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఆదివారం గ్రామంలో పల్లెప్రకృతివనం, నర్సరీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని శ్రమదానంతో శుభ్రం చేశారు. సోమవారం శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం ఆఫీసర్ సమద్ తెలిపారు.

ఖబరస్థాన్ ఏర్పాటు విరమించుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న మేడిపల్లి గ్రామస్తులు

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ మేడిపల్లి శివారులో ఖబరస్థాన్ ఏర్పాటును విరమించుకోవాలని గ్రామస్తులు నిరసన చేపట్టారు. ఆదివారం మేడిపల్లి, మల్కాపూర్ ఓసీపీ–4 రోడ్డులో ఖబరస్థాన్ ఏర్పాటుకు స్థలం కేటాయించకుండా వేరే ప్రాంతంలో కేటాయించాలని గ్రామస్తులు నిరసన చేపట్టారు. ఖబరస్థాన్ ఏర్పాటుతో మేడిపల్లి, జంగాలపల్లి, అన్నపూర్ణ కాలనీ, మల్కాపూర్ రైతులకు అనేక ఇబ్బందులు ఏర్పడతాయని వివరించారు. కార్యక్రమంలో చెప్యాల సత్యనారాయణరావు, బండ లక్ష్మణ్‌రావు, రామారావు, పూసాల శ్రీనివాస్, రాజబాపు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఎలిగేడు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఉన్నతపాఠశాలలో చదివిన 2007–08 ఎస్సెస్సీ బ్యాచ్ 100 మంది పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో అందరు ఒకేచోట కలుసుకుని పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. 15 ఏళ్ల తర్వాత కలుసుకున్న చిన్ననాటి మిత్రులను ఒకరినొకరు ఎంతో ప్రేమతో ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యనేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, గురువులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్య కేంద్రం

- పాములు, తేళ్లు విషపురుగులకు ఆవాసం
- భయపడుతూ విధులు నిర్వహిస్తున్న వైద్యులు



పెద్దరాతుపల్లిలో శిథిలావస్థలో ఉన్న పశువైద్య కేంద్రం

కాల్వశ్రీరాంపూర్: అధికారుల అలసత్వం, పాలకుల నిర్లక్ష్యంతో మండలంలోని పెద్దరాతుపల్లి పశు పశువుల ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరింది. మూడున్నర దశాబ్దాల కింద నిర్మించిన పశు వైద్య కేంద్రం పట్టించుకునే వారులేక భయం కూలిపోయే దశకు చేరుకుంది. వైద్యులు భయం నీడలో విధులు నిర్వహిస్తున్నారు. గోడలు పగులు చూపి, స్లాబ్ పెచ్చులూడుతూ బిల్లలు రాలుతున్నాయి. ఈ భవనంలో పాములు, తేళ్లు, విష కీటకాలు నివాసముంటున్నాయి. కనీసం అద్దె భవనం సైతం దొరకని ఈ గ్రామంలో పశువైద్యులు ఇంటింటికీ వెళ్లి పశువులకు వైద్యం అందిస్తున్నారు. పెద్దరాతుపల్లి పశు వైద్య కేంద్రం పరిధిలో మొట్లపల్లి, ఇదులాపూర్, కిష్టంపేట, చిన్నరాతుపల్లి గ్రామాలున్నాయి. వీటితో పాటు పొరుగున ఉన్న ముత్తారం మండలంలోని ఇతర గ్రామాల రైతులు చికిత్స కోసం పెద్దరాతుపల్లి పశు వైద్య కేంద్రానికి తీసుకువస్తారు. పల్లెలు పశు సంపదతో ముడిపడి ఉంటాయి. పశువులను గో సంపదగా పాడి పంటగా భావిస్తూ రైతులు పశువులను ప్రాణంగా పెంచుకుంటారు. దుక్కి దున్ని విత్తనాలు వేసే పంట ఇంటికి వచ్చే వరకు పశువులతో రైతులకు ముడిపడి ఉంటుంది. పట్టణాల్లో నిత్యం లభించే పాలు పల్లెల నుంచి పట్టణాలకు తీసుకొస్తారు. పల్లెల్లో పాడి పశువులు ఆరోగ్యంగా ఉంటేనే స్వచ్ఛమైన పాలు ప్రజలకు అందుబాటులో ఉండేది. పశువులకు సీజనల్ వ్యాధులు, ఇతర వ్యాధులు వచ్చినా, మరే ఇతర జబ్బులు వచ్చినా పశువులను ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తారు. వ్యవసాయంలో అత్యధిక ప్రాధాన్యత ఉన్న పశువులకు చికిత్స అందించే పశు వైద్య కేంద్రాలు శిథిలావస్థకు చేరినా అధికారులు, పాలకులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై పాడి రైతులు, పశు పెంపకందారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పశు వైద్య కేంద్రానికి పక్కా భవనం మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకుపోయాం



పెద్దరాతుపల్లి పశు వైద్య కేంద్రం విధులు నిర్వహించేందుకు అనుకూలంగా లేదని ఉన్నతాధికారులు దృష్టికి పోయాం. పక్కా భవనం కోసం నిధులు మంజూరు కోసం ప్రజాప్రతినిధులకు చెప్పాం, ఆస్పత్రిలో విష కీటకాలు నివాసముంటున్నాయి. దీంతో ఆస్పత్రి భవనంలో కూర్చోలేకపోతున్నాం. చెట్లకింద కూర్చుని రైతుల ఇంటికి వెళ్లి పశువులకు వైద్య చికిత్స అందిస్తున్నాం.

– డాక్టర్ సునీత, పశువైద్యాధికారి, పెద్దరాతుపల్లి

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం లేదు



సర్కారుకు పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ లేదు. పశువులు బాగుంటేనే మాకు వ్యవసాయం పనులు సాగుతాయి. దుక్కి దున్నాలన్నా, విత్తనాలు వేయాలన్నా, దౌర కొట్టాలన్నా, పంట ఇంటికి రావాలన్నా మాకు ఎడ్లు అవసరం తప్పనిసరి. పశువుల ఆస్పత్రి పాడైపోయింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి నూతన భవనం కట్టించాలి.

– సిద్దం రాజయ్య, రైతు

పక్కా భవనానికి నిధులు మంజూరు చేయాలి



చుట్టూ గ్రామాల రైతులకు ఈ ఆస్పత్రే పెద్దదిక్కు. ఆస్పత్రి భవనం శిథిలమై కూలడానికి సిద్ధంగా ఉంది. ప్రభుత్వం పక్కా భవనానికి నిధులు మంజూరు చేయాలి. దీనికోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధుల మంజూరులో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ పనుల్లో పశువుల ప్రాముఖ్యత అందరికి తెలిసిందే.

– ఓరుగంటి కొమురయ్య సర్పంచ్, పెద్దరాతుపల్లి

ప్రశ్నపత్రాల లీక్‌పై కాంగ్రెస్ శ్రేణుల నిరసన





రామగుండంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు ఎలిగేడులో నాయకుల నిరసన

రామగుండం: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీక్‌ను నిరసిస్తూ ఆదివారం రామగుండం పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. లీకేజీకి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని, లీకేజీ వెనుక ఉన్న సూత్రదారులను గుర్తించాలని, ఉద్యోగ నియామక పరీక్షలు రాసిన నిరుద్యోగులందరికీ లక్ష రూపాయల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఈదునూరి హరిప్రసాద్, అప్పాసి శ్రీనివాస్, సింగం కిరణ్‌కుమార్‌గౌడ్, గట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో మండల కాంగ్రెస్ నాయకులు ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అసమర్థత, తప్పిదం వల్లే నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి , సర్పంచు అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

జూలపల్లి: ప్రశ్న పత్రాల లీక్‌లో ఉన్న వారందరినీ కఠినంగా శిక్షించాలని, సీఎం కేసీఆర్, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కూడలిలో ధర్నా చేపట్టారు. నిరుద్యోగులతో చెలగాటమాడుతున్న ఉద్యోగుల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొమ్మ పోచాలు, కసుకుట్ల ఆంజయ్య,మాంకాలి ఆంజయ్య, బండిస్వామి,నరిసింగం పాల్గొన్నారు.

గోదావరిఖనిటౌన్: టీఎస్‌సీఎస్సీ ప్రశ్నా పత్రాల లీక్‌ను నిరసిస్తూ ఆదివారం గోదావరిఖని చౌరస్తాలో ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి మెంటం ఉదయ్‌రాజ్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉదయ్ మాట్లాడుతు ప్రశ్నా పత్రాల లీకేజీకి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను భర్తరఫ్ చేయాలన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరుపాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు వంశీ,వాసు, శ్రీరామ్, శ్రీమాన్, వినయ్, సుమంత్, తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: టీఎస్‌సీఎస్సీ ప్రశ్నా పత్రాల లీక్‌కు నిరసనగా కాంగ్రెస్ నాయకులు ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. లీకేజీలు, స్కాంలతో, దోపిడీలతో బీఆర్ఎస్ పార్టీ పాలించే హక్కు కోల్పోయిందని వారు ఆరోపించారు. కార్యక్రమంలో ఆపార్టీ మండల కన్వీనర్ మునీర్, సర్పంచ్ కొమురయ్య గౌడ్, ఎంపీటీసీ రావి సదానందం, నాయకులు పాల్గొన్నారు.

బీ–థర్మల్ నిరసన దీక్షను విజయవంతం చేయండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న కౌశిక హరి

రామగుండం: పట్టణంలోని 62.5 మెగావాట్ల బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం పరిరక్షించి అదే ప్రాంతంలో నూతనంగా 800 మెగావాట్ల సామర్థ్యంతో రెండు నూతన థర్మల్ విద్యుత్ కేంద్రాలను స్థాపించాలని కోరుతూ సోమవారం పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో నిరసన దీక్ష చేపట్టనున్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక రైల్వేస్టేషన్ ఏరియాతో పాటు క్రిష్ణనగర్‌లో బీ–థర్మల్ నిరసన దీక్షకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరుతూ బీజేపీ సీనియర్ నాయకుడు కౌశిక హరి, కార్పొరేటర్ కౌశిక లత కరపత్రాలు పంపిణీ చేశారు. 60 ఏళ్ల క్రితం స్థాపించిన బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్వహణకు నిధులు కేటాయించాలని, పట్టణంలో ప్రతిపాదిత బీపీఎల్ విద్యుత్ కేంద్రం పేరుతో వేలాది ఎకరాలు బీళ్లుగా ఉన్నాయని, బీ–థర్మల్‌కు చెందిన వందలాది ఎకరాలు సైతం నిరుపయోగంగా ఉండగా వాటిలో పరిశ్రమలను స్థాపించి స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గంగాప్రసాద్, నిమ్మరాజుల రవి, నందు, మల్లిక్, జర్పుల శ్రీనివాస్, రాజశేఖర్, మారుతి ఉన్నారు.

గోదావరిఖని మహిళకు శక్తి పురస్కార్

కోల్‌సిటీ: వరంగల్‌లోని రత్న హోటల్‌లో వెనిశెట్టి ఈశ్వరయ్య స్మారక సేవా సమితి అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా సదాశయ ఫౌండేషన్ ద్వారా అవయవ, శరీర దానాలతో పాటు, యోగా శిక్షణను ఇస్తూ ఎంతోమంది ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దుతున్న గోదావరిఖనికి చెందిన పట్టణ అధ్యక్షురాలు కొంక అన్నపూర్ణను మహిళా శక్తి పురస్కారంతో సన్మానించారు. కార్యక్రమంలో హైదరాబాద్ కోర్టు సూపరింటెండెంట్ అంజనీకుమారి, డీఎస్ఈ, జాయింట్ డైరెక్టర్ సరోజినిదేవి తదితరులు ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఎలిగేడు: రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఎస్పీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కాంపెల్లి బాబు, ఎలిగేడు మండల అధ్యక్షుడు మారం సతీశ్ డిమాండ్ చేశారు. అన్నదాతలు ఆరుగాలం శ్రమించి అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి, పంటలు చేతికి అందివస్తున్న సమయంలో వర్షాలకు పంటలు దెబ్బతిని తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంట నష్టం వివరాలను సర్వేచేసి బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వారి వెంట పలువురు బీఎస్పీ నాయకులు ఉన్నారు.

చికిత్స కోసం ఆర్థికసాయం

ధర్మారం: మండలంలోని మేడారం గ్రామానికి చెందిన వేల్పుల అనిత–మల్లేశం దంపతుల కుమారుడు శ్రీషాన్ తేజ అనారోగ్యానికి గురికాగా, చికిత్స కోసం కొలుముల దామోదర్ ట్రస్టు సభ్యుడు వేల్పుల నాగరాజు ఆదివారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు నాగరాజు, జేల్ల సంపత్, యాదవసంఘం అధ్యక్షుడు ఆవుల రాజేశం, రాజన్న పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



ఎలిగేడులో పోచమ్మ బోనాలతో మహిళలు



బ్రాహ్మణపల్లిలో పోచమ్మ బోనాలతో గ్రామస్తులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మల్లన్న పట్నాలు, పోచమ్మ కొలువులతో కోలాహలం కనిపించింది. భోజన్నపేట, తురకలమద్దికుంటలో మల్లన్నపట్నాలు వేసి మొక్కులు సమర్పించుకున్నారు. పెద్దపల్లి పట్టణంలోని ముత్యాల పోచమ్మ ఆలయంతో పాటు బొంపల్లి గ్రామశివారులోని జారుడుబండ పోచమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. బ్రాహ్మణపల్లి తదితర గ్రామాల్లో పోచమ్మతల్లికి బోనాలతో మొక్కులు సమర్పించుకున్నారు.

ఎలిగేడు: మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా డప్పు,చప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో ఇంటికో బోనం చొప్పున మహిళలు ఆలయానికి తరలివెళ్లి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భూర్ల సింధూజ, మాజీ ఎంపీపీ కవ్వంపల్లి లక్ష్మి ఎస్సీ కమ్యూనిటీ అధ్యక్షులు కవ్వంపల్లి చంద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



మొక్కజొన్న పంట పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, డీఏవో

ఓదెల: వర్షానికి పంటనష్టపోయిన రైతులను ఆదుకుంటామని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బాయమ్మపల్లె, ఇందుర్తి, గుంపుల, గూడెం గ్రామాల్లో వర్షానికి నష్టపోయిన పంటలను వారు పరిశీలించారు. అకాల వడగండ్ల వర్షానికి నష్టపోయిన పంటల సర్వేతో పాటు వివరాలను సేకరిస్తామన్నారు. అకాల వర్షానికి నష్టపోయిన పంటల పరిహారం కోసం సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు తొల్పూరి కొంరయ్యయాదవ్, ఎల్లస్వామి, చిరంజీవి, రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ అనంతరెడ్డి, రైతుమండల చైర్మన్ కావటి రాజు, ఏవో నాగార్జున, ఏఈవో మౌనిక, ఉపసర్పంచ్ సాంబమూర్తి, రైతులు పాల్గొన్నారు.

వ్యాపార సముదాయాలు ప్రారంభం



వారసంత ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఆర్జీ–2 జీఎం

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా పోతనకాలనీలో రూ.15 లక్షల నిధులతో నిర్మించిన వారసంత, వ్యాపార సముదాయాలను ఆదివారం రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, ఆర్జీ–2 జీఎం మనోహర్‌తో కలసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ కార్మికులకు, ఉద్యోగులకు, సింగరేణి ప్రభావిత గ్రామాల ప్రజలకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఆర్జీ–2 జీఎం మాట్లాడుతూ సంస్థ బొగ్గు ఉత్పత్తే కాకుండా సంక్షేమంలో ఎప్పుడు ముందుంటుందన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్, కార్పొరేటర్లు అమృత రాజయ్య, శంకర్ నాయక్, అధికారులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



వరి పైరును పరిశీలిస్తున్న ఏవో, ఎంపీపీ

రామగుండం: అకాల వర్షాలతో నష్టపోయిన వరి, పత్తి, మొక్కజొన్న పంటలను ఆదివారం అధికారులు పరిశీలించారు. అంతర్గాం మండల పరిధిలోని పలు గ్రామాల్లో క్షేత్ర పర్యటన చేస్తూ అకాల వర్షాలతో ఎవరైనా రైతులు పంట నష్టపోతే తమ దృష్టికి తీసుకురావాలని మండల వ్యవసాయాధికారి భూక్య రాంబాబు కోరారు. ఎంపీపీ దుర్గం విజయ, వ్యవసాయ విస్తీర్ణాధికారులు హరీష్, రమేష్ తదితరులున్నారు.

ఎలిగేడు: అకాల వర్షాలకు ఎలిగేడు మండలంలో పంటలు దెబ్బతిన్నాయి. ఈ మేరకు మండల వ్యవసాయశాఖ అధికారి ఎం.ఉమాపతి ,ఏఈవోలతో మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి వరి, మొక్క జొన్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో ఉమాపతి, రైతుసమన్వయసమితి మండల అధ్యక్షుడు నరినేని సుధాకర్‌రావు, ఏఈవో పద్మ, రైతులు ఉన్నారు.

కమాన్‌పూర్: మండలంలో నాగారం, రొంపికుంట, పేంచికల్‌పేట, లింగాల గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి, మొక్కజొన్న పంటలను ఏవో బండి ప్రమోద్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. ఏవో వెంట ఏఈవోలు యాదగిరి శ్రీనివాస్, అజ్మీరా సురేశ్‌ఖలు, రైతులున్నారు.

రామగిరి: ముత్తారం మండల కేంద్రంతో పాటు మండలంలోని మైదంబండ, ఖమ్మంపల్లి గ్రామాల్లోని వివిధ పంటలను ఆదివారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. పంటల వివరాలు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఈవోలు మౌనిక, హారిక, శ్రీలేఖ రెతులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

వందశాతం పన్నులు వసూలు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని 16 గ్రామ పంచాయతీల్లో వంద శాతం పన్నులు వసూలు చేశామని అంతర్గాం ఎంపీవో మోతె సమ్మిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం పన్నుల వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని 16 గ్రామ పంచాయతీల పరిధిలో రూ.14,63,708 వసూలు కావాల్సి ఉండగా వందశాతం వసూలు చేసినట్లు తెలిపారు. పదిరోజులు ముందుగానే లక్ష్యాన్ని చేరుకున్నామని పేర్కొన్నారు. పన్నుల వసూలు కోసం పంచాయతీ కార్యదర్శులకు సహకరించిన మండల ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

పెద్దపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న ఢిల్లీలో తలపెట్టిన నిరసన కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొనాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ కోరారు. పెద్దపల్లిలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం పోస్టర్ ఆవిష్కరించారు. ప్రభుత్వ రంగసంస్థలను ప్రైవేట్ పరం చేసేందుకు బీజేపీ పాలకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నాయకులు కుమారస్వామి, యాకయ్య, గణేశ్, జ్యోతి, రామాచారి, మహేశ్వరి, రవీందర్, అశోక్ తదితరులున్నారు.

చెక్కులు పంపిణీ

మంథని: మండలంలోని గద్దలపల్లి గ్రామానికి చెందిన కుమార్‌కు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన చెక్కును ఆదివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్ లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బుద్దార్థి రవి, ఎంపీటీసీ తోంబూరపు సుజాత తదితరులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి గ్రామానికి చెందిన చిట్యాల మమతకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.16వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఉప సర్పంచ్ సాయికుమార్ తదితరులు అందజేశారు.

బీఆర్ఎస్ యూత్ కో–ఆర్డినేటర్‌గా కుమార్ నాయక్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ యూత్ కో–ఆర్డినేటర్‌గా యైటింక్లయిన్‌కాలనీకి చెందిన గుగులోత్ కుమార్ నాయక్‌ను నియమించినట్లు ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రకటించారు. ఈమేరకు ఆదివారం కాలనీ భవాని గార్డెన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీనివాస్, కార్పొరేటర్లు, శంకర్ నాయక్, అంజలీదేవి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పెరిక సంఘం అధ్యక్షుడిగా సంతోష్

ధర్మారం: మండలంలోని నందిమేడారం పెర్కసంఘం అధ్యక్షుడిగా గోళ్ళ సంతోష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంతోష్, ఉపాధ్యక్షుడిగా సందేల లింగయ్య, ప్రధాన కార్యదర్శిగా బరుపటి కిష్టయ్య, కోశాధికారిగా అక్క లక్ష్మణ్, గౌరవ సలహాదారుడి గాఅత్తె రాజారాం, సలహదారులుగా చంద్రయ్య, ధనిశెట్టి మల్లయ్య, బియ్యాల సత్తయ్య, సందేల పోచయ్యను ఎన్నుకున్నారు.

సమాచారం

సబ్సిడీ రుణాల లబ్ధిదారుల ఎంపికకు నేడు ఇంటర్వ్యూలు

రామగిరి: దివ్యాంగుల సబ్సిడీ రుణాల లబ్ధిదారుల ఎంపిక కోసం నేడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఇనుముల రమేశ్ తెలిపారు.

నేడు పొత్కపల్లిలో సొసైటీ సర్వసభ్య సమావేశం

ఓదెల: మండలంలోని పొత్కపల్లి సింగిల్‌విండో సొసైటీ కార్యాలయంలో సోమవారం ఉదయం 11గంటలకు సర్వసభ్యసమావేశం జరగుతుందని చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

అప్పన్నపేట సొసైటీ సమావేశం..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అప్పన్నపేటలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ పాలకమండలి సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు వైస్ చైర్మన్ సంపత్ తెలిపారు.

నేడు కంటివెలుగు వైద్య శిబిరం ప్రారంభం

జూలపల్లి: మండలంలోని వెంకట్రావుపల్లెలో కంటి వెలుగు వైద్య శిబిరం ప్రారంభిస్తున్నట్లు మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి చెప్పారు.

నేడు పెద్దాపూర్ జాతర వేలం పాట

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ శ్రీ యోగానంద లక్ష్మీనర్సింహస్వామి రథోత్సవం సందర్భంగా నిర్వహించే జాతరలో దుకాణాల వేలం పాటలను నేడు నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో సదయ్య తెలిపారు.

ఈనెల 20న సర్వసభ్య సమావేశం

సుల్తానాబాద్: సుల్తానాబాద్ పీఏసీఎస్‌లో ఈ నెల 20వ తేదీన చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ కార్యదర్శి బూరుగు సంతోష్ కుమార్ తెలిపారు.